ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్‌: కిలో..టమాటా.43, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 45, పచ్చిమిర్చి 65, బజ్జీమిర్చి 65, క్యాప్సికమ్‌ 65, పచ్చకాకర 23, పందిరి బీర 23, క్యాబేజీ 18, క్యారెట్‌ 40, దొండ 18, గుండుబీన్స్‌ 60, గింజ చిక్కుడు 55, గోకరకాయ 40, కీర 18, దోసకాయ 15, బీట్‌రూట్‌ 28, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 23, చామగడ్డ 26, మొరంగడ్డ 35, కందగడ్డ 50, సొరకాయ 11, పొట్లకాయ 18, అరటికాయ 11, మునగకాయ 3–4, ముల్లంగి 5–6. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

చిలుకు స్వామికి గౌరవ డాక్టరేట్‌



సికింద్రాబాద్‌: దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్‌ కోపరేటివ్‌ సొసైటీ అధ్యక్షుడిగా సేవలు అందజేస్తున్న చిలుకు స్వామికి గోవాలోని ఈఎస్‌ యూనివర్సిటీ గురువారం ఆనర్‌ ఆఫ్‌ డాక్టర్‌ ప్రకటించింది. ఆలేరు మండలం షారాజిపేట గ్రామ నివాసి అయిన స్వామి ఒక వైపు రైల్వే ఉద్యోగిగా పనిచేస్తూనే గ్రామంలో ఆరోగ్య శిబిరాలు, రక్తదానం, శ్రమదానం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ యువకులను చైతన్య పరుస్తున్నారు. ఈయన సేవలను గుర్తించిన ఈఎస్‌ యూనివర్సిటీ గ్రీన్‌ అచీవ్మెంట్‌ అవార్డు 2025తో ఆనర్‌ ఆఫ్‌ డాక్టరేట్‌ను ప్రదానం చేయనున్నారు. చిలుక స్వామికి ఈ గౌరవ డాక్టరేట్‌ ప్రకటించడం పట్ల సౌత్‌ సెంట్రల్‌ రైల్వే ఎంప్లాయిస్‌ కో–ఆపరేటివ్‌ సొసైటీ కార్యవర్గ సభ్యులు, పలువురు రైల్వే ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

సంఘసేవకుడు నాగులూరి నర్సింహకు నివాళి



చిలకలగూడ : దళిత జనబాంధవుడు, సంఘ సేవకుడు మేడ్చల్‌ నర్సింహ 48వ వర్ధంతి వేడుకలు ప్రముఖ పారిశ్రామికవేత్త, నాగులూరి వెల్ఫేర్‌ అసోసియేషన్‌ చైర్మన్‌ నాగులూరి సాయిబాబా ఆధ్వర్యంలో చిలకలగూడ జీహెచ్‌ఎంసీ పార్కులో గురువారం నిర్వహించారు. మేడ్చల్‌ నర్సింహ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తన తండ్రి ఆశలు, ఆశయాల సాధన కోసం కృషి చేస్తానని సాయిబాబా తెలిపారు.

35 మందిపై డ్రంకన్‌ డ్రైవ్‌ కేసులు నమోదు



ఆలుగడ్డబావి రోడ్డులో డ్రంకన్‌ డ్రైవ్‌ పరీక్షలు నిర్వహిస్తున్న ట్రాఫిక్‌ పోలీసులు

సికింద్రాబాద్‌: మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 35 మందిపై కేసులు నమోదు చేసినట్టు చిలకలగూడ ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ సీహెచ్‌.శ్రీనివాసులు తెలిపారు. గురువారం మెట్టుగూడ ప్రధాన రహదారిలోని ఆలుగడ్డ బావి వద్ద చిలకలగూడ ట్రాఫిక్‌ పోలీసులు డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్‌ శ్రీనివాసులు మాట్లాడుతూ పగలు,రాత్రి డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌ పరీక్షలు ప్రారంభించినప్పటి నుంచి 35 మంది వాహనదారులు మద్యం తాగి పట్టుబడ్డట్టు చెప్పారు. ఇందులో పగటి వేళల్లో 18 మంది, రాత్రి సమయాల్లో 17 మందిని గుర్తించి కేసులు నమోదు చేసినట్టు ఆయన చెప్పారు.

హోంగార్డులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



కిషన్‌రెడ్డికి వినతి పత్రం సమర్పిస్తున్న హోం గార్డ్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ ప్రతినిధులు

లాలాపేట: శాంతిభద్రతల పరిరక్షణలో దేశ వ్యాప్తంగా సేలందిస్తున్న హోంగార్డులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని నేషనల్‌ హోంగార్డ్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ డిమాండ్‌ చేస్తుంది. ఈ మేరకు అసోసియేషన్‌ ప్రతినిధులు కమల్‌ శర్మ, పాకాల రాజశేఖర్‌, శ్యామ్‌ పాల్‌, శ్యామ్‌ వీర్‌ తదితరులు గురువారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసి వినతి హోంగార్డుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పత్రాన్ని అందజేశారు

టార్గెట్‌.. ట్యాక్స్‌

- జీహెచ్‌ఎంసీ అధికారుల ట్రేడ్‌ లైసెన్సుల స్పెషల్‌ డ్రైవ్‌
- రూ.96 కోట్ల వసూలు లక్ష్యంగా అధికారుల అడుగులు



పన్నుల విభాగం స్పెషల్‌ డ్రైవ్‌ను పర్యవేక్షిస్తున్న జీహెచ్‌ఎంసీ డీసీ ఆంజనేయులు

సికింద్రాబాద్‌: అదనపు ఆదాయాన్ని రాబట్టుకునేందుకు జీహెచ్‌ఎంసీ అధికారులు స్పెషల్‌ డ్రైవ్‌ ప్రారంభించారు. ఈ నెల 22న ప్రారంభమైన ఈ కార్యక్రమం ఆగస్టు 23 వరకు కొనసాగించనున్నారు. ఈ మారు ముఖ్యంగా వ్యాపార వర్గాలను టార్గెట్‌గా చేసుకుని ఆదాయ మార్గాన్ని పెంచుకునేందుకు జీహెచ్‌ఎంసీ నిర్ణయించింది. ఈ మేరకు కమిషనర్‌ ఇచ్చిన ఆదేశాల మేరకు డిప్యూటీ కమిషనర్‌ మొదలు, టాక్స్‌ విభాగం అధికారులు, ఉద్యోగులు ఉరుకులు పరుగులు తీస్తున్నారు.

- ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రాంతాల వారిగా అధికారులు ఫీల్డ్‌వర్క్‌లో ఉంటూ ఆదాయం రాబట్టుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. సర్కిల్‌ పరిధిలోని వ్యాపార సముదాయాలు ఉండే ప్రాంతాలను ఎంచుకుంటున్న జీహెచ్‌ఎంసీ అధికారులు ఆయా ప్రాంతాల వ్యాపార, వాణిజ్య సముదాయాల వారిని కలుస్తూ ట్రేడ్‌ లైసెన్స్‌లు జారీ చేయడం, కొత్తగా కమర్షియల్‌ ట్యాక్సు విధించడం వంటి పనుల్లో బీజీగా ఉంటున్నారు.

టార్గెట్‌ చేసిన ప్రాంతాలు ఇవీ!

సికింద్రాబాద్‌ సర్కిల్‌ పరిధిలోని ప్రధాన రహదారులను తొలుత ఎంపిక చేసుకుని ప్రాంతాల వారిగా టాక్స్‌ ఇన్‌స్పెక్టర్లు, పర్యవేక్షకులు, బిల్‌కలెక్టర్లను నియమించారు. మారేడుపల్లి నుంచి తుకారాం గేట్‌ మీదుగా లాలాపేట, లాలాపేట నుంచి తార్నాక, తార్నాక నుంచి చిలకలగూడ కూడలి, చిలకలగూడ కూడలి నుంచి సీతాఫల్‌మండి, సీతాఫల్‌మండి నుంచి వారాసీగూడ మీదుగా జామై ఉస్మానియా వరకు గల వ్యాపార, వాణిజ్య వర్గాల వారిని ఎంపిక చేసుకుని పన్ను మదింపు చేస్తున్నారు.

స్పెషల్‌ డ్రైవ్‌ షెడ్యూలు తీరు...

ఈనెల 22 నుంచి 26 వరకు షాపింగ్‌మాల్స్‌, సినిమా థియేటర్లు, 28 నుంచి ఆగస్టు 2 వరకు హోటళ్లు, రెస్టారెంట్లు, లాడ్జీలు, 4 నుంచి 8వ తేదీ వరకు కార్లు, ద్విచక్ర వాహనాలు తదితర అన్ని రకాల వాహనాల షో రూంలు, 11 నుంచి 14 వ తేదీ వరకు ఫంక్షన్‌హాళ్లు, క్లాత్‌స్టోర్స్‌, గోడౌన్‌లు, వర్క్‌షాపులు, 18 నుంచి 23 వరకు కార్పొరేట్‌ ఆసుపత్రులు, డయగ్నొస్టిక్‌ సెంటర్లు, నర్సింగ్‌ హోమ్‌లపై దాడులు నిర్వహించనున్నారు.

వసూలు లక్ష్యం రూ. 96 కోట్లు

సికింద్రాబాద్‌ సర్కిల్‌ పరిధిలో గత ఆర్థిక సంవత్సరంలో రూ.28 కోట్లు ఆస్తిపన్ను వసూలైంది. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.96 కోట్లు వసూలు చేయాలని జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం నుంచి ఆదేశాలు రావడంతో సికింద్రాబాద్‌ సర్కిల్‌ అధికారులకు ఏంచేయాలో తెలియని పరిస్థితి నెలకొంది. డొమెస్టిక్‌ భవనాలపై ఎంతమేర పన్ను మదించినా పెద్దగా ఆదాయం పెరిగే అవకాశం లేదు.

- ప్రత్యామ్నాయంగా వ్యాపార, వాణిజ్య భవనాలపై అధికారులు దృష్టి సారించారు. అన్ని రకాల వ్యాపారాలకు ట్రేడ్‌ లైసెన్స్‌ పక్కాగా ఉండాలని అధికారులు హుంకుం జారీ చేస్తున్నారు. ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ వ్యాపారులు లైసెన్స్‌ తీసుకునేవిధంగా చర్యలు తీసుకుంటున్నారు. పెద్ద మొత్తంలో బకాయి పడిన వ్యాపార సంస్థలను సీజ్‌ చేస్తున్నారు.
- తాజాగా చిలకలగూడ ప్రాంతంలోని ఒక కల్లు కాంపౌండ్‌ భవనం రూ.8 లక్షలు బకాయి ఉండగా దీనిని సీజ్‌ చేశారు. మరో 20 వరకు వివిధ రకాల వ్యాపార భవనాలను సీజ్‌ చేశారు. వసూలు లక్ష్యం చేధించడం మాట అటుంచి తాజా చర్యల ద్వారా కనీసం రూ.10 నుంచి రూ.20 కోట్ల ఆదాయాన్ని అయినా అదనంగా రాబట్టుకునే ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో జూలై 20 నాటికి రూ.15 కోట్ల వసూళ్లు చేసినట్టు అధికారులు తెలిపారు.

ఆగస్టు తరువాత చర్యలు తప్పవు

ట్రేడ్‌ లైసెన్స్‌, ఆస్తిపన్ను మదింపు కోసం ఆగస్టు నెలాఖరు వరకు స్పెషల్‌ డ్రైవ్‌ నిర్వహిస్తాం. నిర్దీత గడువులోగా వ్యాపార, వాణిజ్య సంస్థల నిర్వాహకులు, భవనాల యజమానులు టాక్సు విభాగం అధికారులకు సహకరించాలి. వ్యాపారులు అందరూ లైసెన్స్‌లు తీసుకోవాలి, పాతవి రెన్యూవల్‌ చేయించుకోవాలి. టువంటా వ్యాపారాలు కలిగి ఉన్నవారైనా ట్రేడ్‌ లైసెన్స్‌ పక్కాగా పొందాలి. కమ్మర్షియల్‌ భవనాల పన్నులు చెల్లించాలి. ఆగస్టు నెలాఖరులోపు స్పందించని వారిపై చర్యలు తప్పవు.

-జీ.ఆంజనేయులు, డిప్యూటీ కమిషనర్‌

'గాంధీ' కాంట్రాక్టు వైద్యపోస్టులకు గట్టి పోటీ



గాంధీ మెడికల్‌ కాలేజీ

గాంధీఆస్పత్రి : సికింద్రాబాద్‌ గాంధీ మెడికల్‌ కాలేజీ, ఆస్పత్రుల్లో ఖాళీగా ఉన్న వైద్య పోస్టుల భర్తీకి గట్టి పోటీ నెలకొంది. 160 పోస్టులకు 747 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఒక్కో పోస్టుకు 4.6 నిష్పత్తిలో దరఖాస్తులు వచ్చినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. కొంతమంది ఆన్‌లైన్‌లో ఒకేపోస్టుకు రెండుసార్లు దరఖాస్తు చేసుకోగా, ఒక దరఖాస్తు మాత్రమే పరిగణనలోకి తీసుకుని రెండవదాన్ని తొలగించారు. ప్రొఫెసర్‌ పోస్టులకు ఎటువంటి పోటీ లేకపోవడం గమనార్హం. బయోకెమిస్ట్రీ, మైక్రోబయోలజీ విభాగాల్లో ఒక్కో ప్రొఫెసర్‌ పోస్టులకు దరఖాస్తులు కోరగా బయోకెమిస్ట్రీకి ఒకే ఒక దరఖాస్తు రాగా, మైక్రోబయోలజీకి ఎవరూ దరఖాస్తు చేసుకోకపోవడం విశేషం. తెలంగాణ వైద్యశాఖలో ఇటీవల జరిగిన భారీ బదిలీలు, పదోన్నతుల్లో గాంధీఆస్పత్రి, మెడికల్‌ కాలేజీల నుంచి పెద్దసంఖ్యలో వైద్యులు ఇతర ప్రాంతాలకు వెళ్లారు. తెలంగాణ వైద్యరంగానికి గుండెకాయ వంటి గాంధీఆస్పత్రి, మెడికల్‌ కాలేజీల్లో ఏర్పడిన ఖాళీ పోస్టులకు కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేయాలని నిర్ణయించిన ప్రభుత్వం ఇటీవల నోటిఫికేషన్‌ జారీ చేసింది. ఈ క్రమంలో ప్రొఫెసర్లు, అసోసియేట్‌ ప్రొఫెసర్లు, సీనియర్‌ రెసిడెంట్లు, సివిల్‌ అసిస్టెంట్‌ సర్జన్‌, ట్యూటర్లు మొత్తం 160 పోస్టులకు పెద్దసంఖ్యలో అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ట్యూటర్‌ పోస్టులకు 8.8 నిష్పత్తిలో ఎక్కువ పోటీ ఉండగా, సీనియర్‌ రెసిడెంట్లకు 3.8 నిష్పత్తిలో తక్కువ పోటీ నెలకొంది. దరఖాస్తుల పరిశీలన, మెరిట్‌లిస్ట్‌, అభ్యంతరాల స్వీకరణ, ఫైనల్‌ మెరిట్‌ లిస్ట్‌, సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం ఆగస్ట్‌ 4న అర్హులకు నియామకపత్రాలు అందిస్తారు.

పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం



సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న బోర్డు సభ్యురాలు బానుక నర్మద

కంటోన్మెంట్‌: కంటోన్మెంట్‌ బోర్డు పరిధిలోని కాలనీలు, బస్తీల్లో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యమని బోర్డు నామినేటెడ్‌ సభ్యురాలు భానుక నర్మద అన్నారు. గురువారం కంటోన్మెంట్‌ నాలుగో వార్డు శివ అరుణ్‌ కాలనీలో రూ.22 లక్షల నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా బానుక నర్మద మాట్లాడుతూ బోర్డులో నిధుల లేమి ఉన్నప్పటికీ, ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు చేడుతున్నామన్నారు. ఎలివేటెడ్‌ కారిడార్‌ల కోసం కేటాయించిన భూముల పరిహారం సొమ్ము రూ.303 కోట్లతో నాలాలు, భూగర్భ డ్రైనేజీ లైన్‌లను పూర్తి స్థాయిలో ఆధునీకరిస్తామన్నారు. కార్యక్రమంలో శివ అరుణ్‌ కాలనీ ప్రెసిడెంట్‌ సి ఎం ప్రకాష్‌ రావు, బిజెపి నియోజకవర్గ కన్వీనర్‌ విజయానంద్‌, వార్డు అధ్యక్షులు సచిన్‌, బీజేపీ సీనియర్‌ నాయకులు టోపీ శంకర్‌, నాగభూషణం రెడ్డి నాయకులు, కార్యకర్తలు పాల్గొనటం జరిగింది.

సంజయ్‌నగర్‌లో పోలీసుల కార్డన్‌ సెర్చ్‌



కార్డన్‌ సెర్చ్‌లో అడిషనల్‌ డీసీపీ, ఏసీపీలు

రహమత్‌నగర్‌: బోరబండ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని శ్రీరాంనగర్‌, సంజయ్‌నగర్‌ బస్తీల్లో పోలీసులు బుధవారం రాత్రి కార్డన్‌ అండ్‌ సెర్చ్‌ నిర్వహించారు. దాదాపు 3 గంటల పాటు కొనసాగిన ఈ కార్యక్రమంలో అడిషనల్‌ డీసీపీ గోవర్ధన్‌, ఎస్‌ఆర్‌నగర్‌ డివిజన్‌ ఏసీపీ రాఘవేంద్రరావు పాల్గొన్నారు. సరైన పత్రాలు లేని 29 ద్విచక్ర వాహనాలు, మూడు ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. తొమ్మిది మంది రౌడీ షీటర్లు, ఏడుగురు అనుమానాస్పద వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. శ్రీరాంనగర్‌ కూరగాయాల మార్కెట్‌ వద్ద అడిషనల్‌ డీసీపీ గోవర్ధన్‌, ఏసీపీ రాఘవేంద్రరావు స్థానికులతో మాట్లాడారు. సేఫ్‌ అండ్‌ సెక్యూర్‌ గురించి వారికి వివరించారు. అనంతరం హెచ్‌ఎఫ్‌నగర్‌ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అడిషనల్‌ డీసీపీ మాట్లాడుతూ నేరాలు అరికట్టడంలో ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. పిల్లల ప్రవర్తనను తల్లిదండ్రులు గమనించాలని సూచించారు. బోరబండ ఎస్‌హెచ్‌ఓ సురేందర్‌, సెక్టార్‌ ఎస్సైలు నాగూల్‌ మీరా, స్వప్నారెడ్డి, భూమేశ్వర్‌, కాశయ్యతో పాటు దాదాపు 200 మంది పోలీసులు పాల్గొన్నారు.

జర్నలిజంలో ఏఐ టెక్నాలజీ వినియోగంపై వర్క్‌షాప్‌



జర్నలిజం విద్యార్థులతో సుధాకర్‌ రెడ్డి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ జర్నలిజం విభాగంలో ఏఐ (కృత్రి మేథస్సు) టెక్నాలజీ వినియోగం పై గురువారం వర్క్‌షాప్‌ జరిగింది. జర్నలిజం విభాగం, డాటా లీడ్స్‌ సంయుక్త ఆధ్వర్యంలో అదిర (ఆల్‌ ఫర్‌ డిజిటల్‌ రీడినెస్‌ అండ్‌ అడ్వాన్స్‌మెంట్‌) అనే అంశం పై వర్క్‌షాప్‌ జరిగింది. సీనియర్‌ జర్నలిస్ట్‌, ది టైమ్స్‌ ఆఫ్‌ ఇండియా ఎడిటర్‌ (పరిశోధనలు) ఉడుముల సుధాకర్‌ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై పై ప్రసంగించారు. జర్నలిజం విభాగం హెడ్‌ ప్రొ.సతీష్‌, డా.రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సెల్ఫ్‌-కేర్‌ డే వేడుకలు

సనత్‌నగర్‌: ఇంటర్నేషనల్‌ సెల్ఫ్‌ కేర్‌ డే సందర్భంగా గురువారం బేగంపేటలో కిమ్స్‌ సన్‌షైన్‌ హాస్పటల్‌లో 'యోగా ఫర్‌ ఆల్‌' పేరిట ప్రత్యేక వెల్‌నెస్‌ కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్టిఫైడ్‌ యోగా పండితురాలు, థెరపిస్టు, ఫేస్‌ యోగా నిపుణురాలు కారత్యని అంకుష్‌ ఆధ్వర్యంలో జరిగిన ఈ సెషన్‌లో కుర్చీపై సులభంగా చేసే యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానంతో పాటు దైనందిన స్వీయ సంరక్షణ కోసం ఉపయోగకరమైన సూచనలు చేశారు. హాస్పటల్‌ మేనేజింగ్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ ఏవీ గురువారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌ స్తంభాన్ని ఢీ కొట్టిన కారు



లాలాపేట ప్రధాన రహదారిలో ట్రాఫిక్‌ జామ్‌

లాలాపేట: అర్ధరాత్రి వేళ లాలాపేట ప్రధాన రహదారిలో బుధవారం రాత్రి సంతోష్‌ అలియాస్‌ గజినీ అనే వ్యక్తి మద్యం మత్తులో కారు వేగంగా నడుపుతూ షాన్‌భాగ్‌ ఫంక్షన్‌ హాల్‌ వద్ద విద్యుత్‌ స్తంభాన్ని ఢీ కొట్టాడు. ఈ సంఘటనలో విద్యుత్‌ స్తంభం విరిగిపోగా కారు రెండు మూడు పల్టీలు కొట్టింది. దీంతో దాదాపు 5 గంటల పాటు ఆ ప్రాంతంలో విద్యుత్‌ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. వాహనాలు రోడ్డుపై ఆగిపోయాయి. సమాచారం అందుకున్న పోలీసులు, విద్యుత్‌ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

కుమారుడితో సహా మహిళ అదృశ్యం



పుష్ప

సికింద్రాబాద్‌: నాలుగేళ్ల కుమారుడితో సహా ఒక మహిళ సికింద్రాబాద్‌ రైల్వేస్టేషన్‌ నుంచి కనిపించకుండా పోయింది. జీఆర్‌పీ ఎస్‌ఐ రమేశ్‌ తెలిపిన మేరకు.... ఛత్తీస్‌ఘడ్‌ రాష్ట్రం బిర్కుల్‌కు చెందిన భగవత్‌ ప్రసాద్‌ యాదవ్‌ తాపీమేస్త్రీ. భార్య పుష్ప (30), నాలుగేళ్ల కుమారుడిని తీసుకుని ఉపాధి కోసం మూడు నెలల క్రితం నగరానికి వచ్చాడు. ఈనెల 17న తిరిగి తమ సొంత ఊరికి వెళ్లేందుకు సికింద్రాబాద్‌ రైల్వేస్టేషన్‌కు వచ్చారు. భార్య పుష్పతోపాటు కుమారుడిని రైల్వేస్టేషన్‌ వెయిటింగ్‌ హాలులో కూర్చోబెట్టిన భగవత్‌ ప్రసాద్‌ యాదవ్‌ రైలు కోసం ఆరాతీసి వచ్చిన సమయంలోనే భార్య, కుమారుడు కనిపించకుండా పోయారు. పలు ప్రాంతాల్లో ఆరా తీసిన భగవత్‌ప్రసాద్‌ గురువారం సికింద్రాబాద్‌ రైల్వే పోలీసులకు ఆశ్రయించారు. మిస్సింగ్‌ కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక అదృశ్యం



అమ్ములు

సికింద్రాబాద్‌: గాంధీనగర్‌ పీఎస్‌ పరిధిలో ఓ బాలిక అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.... అమ్ములు (17) అనే బాలికను ఈనెల 17న చైల్డ్‌ వెల్ఫేర్‌ కమిటీ వారు బన్సీలాల్‌పేటలోని వికలాంగుల ఆశ్రమంలో చేర్పించారు. ఈనెల 22న అమ్ములు కనిపించకుండా పోయింది. ఆశ్రమం ఇన్‌చార్జి జి.రాజీవ్‌ సీసీ కెమెరా పుటేజీలు పరిశీలించగా అమ్ములు ఆశ్రమం నుంచి ఒంటరిగా బయటకు వెళ్లినట్టు గుర్తించారు.చుట్టు పక్కల గాలించినా ఆచూకీ కానరాలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విద్యారంగ సమస్యలపై పోరు

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలపై అఖిల భారత స్టూడెంట్‌ బ్లాక్‌ (ఏఐఎస్‌బీ) పోరాడనున్నట్లు రాష్ట్ర కన్వీనర్‌ హకీమ్‌ నవీద్‌ తెలిపారు. గురువారం ఆయన ఓయూలో మాట్లాడుతూ నేతాజీ సుభాష్‌ చంద్రబోస్‌ ఆశయ సాధనకు 1951లో కొలకత్తాలో ఆవిర్భావించిన ఏఐఎస్‌బీ అనతి కాలంలోనే దేశ వ్యాప్తంగా విస్తరించి విద్యారంగ సమస్యల పై అవిశ్రాంతగా పోరాడుతూనే ఉందన్నారు. తెలంగాణలో ఏఐఎస్‌బీని బలోపేతం చేసేందుకు నేటి నుంచి (25న) సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు చెప్పారు.

తమిళనాడులో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు

ఉస్మానియా యూనివర్సిటీ: తమిళనాడులో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు అమలవుతున్నాయని ఆల్‌ ఇడియా ఓబీసీ జేఏసీ చైర్మన్‌ డా.అవ్వారు వేణుకుమార్‌ అన్నారు. గురువారం ఆయన ఓయూలో మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ల పై బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచందర్‌ రావు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. తమిళనాడు రాష్ట్రంలో 31 ఏండ్లుగా బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు అమలవుతుంటే తెలంగాణలో 42 శాతం సాధ్యం కాదని మంత్రి మండలి ఆమోదముద్ర వేసిన అనంతరం బీజేపీ అధ్యక్షుడు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల పై బీజేపీ ద్వంద్వ వైఖరీ వీడాలన్నారు.

వ్యభిచార గృహంపై దాడి.. ముగ్గురి అరెస్ట్‌

అమీర్‌పేట: ఎస్‌ఆర్‌నగర్‌ పోలీసులు వ్యభిచార గృహంపై దాడిచేసి ముగ్గురిని అరెస్ట్‌ చేశారు. యూసుఫ్‌గొడకు చెందిన శంకర్‌నాయక్‌, సరస్వతి దంపతులు బల్కంపేటలోని ఓ అపార్ట్‌మెంట్‌లో రెండు నెలలుగా వ్యభిచారం నిర్వహిస్తున్నారు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. గురువారం మధ్యాహ్నం సోదాలు నిర్వహించి ఫ్లాట్‌లో ఇద్దరు యువతులను అదుపులోకి తీసుకున్నారు. నిర్వాహకులు శంకర్‌నాయక్‌, సరస్వతితో పాటు ఓ విటుడిని అరెస్టు చేశారు. కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఇన్స్‌పెక్టర్‌ శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు.

స్కూల్‌ బస్సు డ్రైవర్లపై యాజమాన్యాల నిఘా తప్పనిసరి

బంజారాహిల్స్‌: స్కూల్‌ బస్సులు నడిపే డ్రైవర్లపై పాఠశాలల యాజమాన్యాలు నిఘా పెట్టాలని, అవసరమైతే వారికి స్కూల్‌ వద్ద యాజమాన్యాలు శ్వాస పరీక్షలు నిర్వహించాలని, ట్రాఫిక్‌ ఏసీపీ మోహన్‌ కుమార్‌ సూచించారు. ఖైరతాబాద్‌ చౌరస్తాలో స్కూల్‌ డ్రైవర్ల కోసం గురువారం స్పెషల్‌ డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌ నిర్వహించారు. ఈ డ్రైవ్‌ను అడిషనల్‌ డీసీపీ రాములు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని రోజుల క్రితం జాయింట్‌ సీపీ జోయల్‌ డేవిస్‌ సూచనల మేరకు కొన్నిచోట్ల స్పెషల్‌ డ్రైవ్‌లు నిర్వహించగా కొంతమంది బస్సు డ్రైవర్లు తాగి వాహనాలు నడిపినట్లు తాము గుర్తించామని, స్కూల్‌ విద్యార్థులను తీసుకెళ్లే డ్రైవర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రమాదాలు తప్పవన్నారు.సైఫాబాద్‌ ట్రాఫిక్‌ సీఐ సైదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

లాలాపేట: గుర్తు తెలియని ఓ వ్యక్తి మృత దేహం లభ్యమైన సంఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీసు స్టేషన్‌ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. లాలాపేట విజయ డెయిరీ క్వార్టర్స్‌ సమీపంలో ఈ నెల 23న సాయంత్రం దాదాపు 50 సంవత్సరాల వయస్సు ఉన్న ఓ వ్యక్తి మృతదేహం పడి ఉండటాన్ని గమనించిన స్థానికులు 100కు డయల్‌ చేసి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఓయూ పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించగా మృతదేహం కుళ్లిన దశలో ఉంది. వెంటనే 108 అంబులెన్స్‌ ద్వారా పోస్టుమార్టం నిమిత్తంగా గాంధీ హాస్పిటల్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. 5.5 అడుగుల ఎత్తు, గ్రీన్‌ కలర్‌ చెక్‌ షర్టు, బ్లూ కలర్‌ ప్యాంట్‌ ధరించనట్లు మృతుడి వివరాలను పోలీసులు తెలియజేశారు.

కత్తితో దాడిచేసి పర్సుతో పరారైన ఇద్దరు యువకుల అరెస్టు

ఫిలింనగర్‌: వాహనదారుడిని కత్తితో బెదిరించి పర్సుతో పాటు సెల్‌ఫోన్‌ లాక్కొని పరారైన దొంగలను ఫిలింనగర్‌ పోలీసులు గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలు.. 16వ తేదీన అర్ధరాత్రి తర్వాత షేక్‌పేట డీమార్ట్‌ సమీపంలో రెడీమిక్స్‌ కాంక్రీట్‌ వాహనం పార్కు చేసి ఉంది. అదే సమయంలో మహ్మద్‌ జకీవుద్దీన్‌(19), మహ్మద్‌ ఇమ్రాన్‌(21)తో పాటు మరో వ్యక్తి ముగ్గురూ కలిసి రెడీమిక్స్‌ వాహన డ్రైవర్‌ వద్దకు వెళ్లి నగదు డిమాండ్‌ చేయడంతో అతడు తిరస్కరించాడు. కత్తితో దాడి చేసి అతడి వద్ద ఉన్న పర్సు లాక్కొని పరారయ్యారు. గాయాలపాలైన అతడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టి జకీవుద్దీన్‌, ఇమ్రాన్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి యాక్టివా వాహనం, రెండు మొబైల్‌ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

కల్లుగీత సొసైటీలకు రిజర్వేషన్‌ కల్పించాలి



మాట్లాడుతున్న బాలరాజుగౌడ్‌

పంజగుట్ట: రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే వైన్స్‌ టెండర్లు పిలిచేందుకు యత్నిస్తున్న నేపథ్యంలో ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు 25 శాతం కల్లుగీత సొసైటీలకు రిజర్వేషన్‌ కల్పించాలని తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్‌ బాలగోని బాలరాజు గౌడ్‌ కోరారు. గౌడ కులస్తులను బినామీలుగా ఉంచి అగ్రవర్ణాల వారు టెండర్లు పొందే అవకాశం ఉన్నందున కల్లుగీత సొసైటీలకు 25 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే గౌడ కులస్తులకు న్యాయం జరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర కన్వీనర్‌ అయిలి వెంకన్న గౌడ్‌, వర్కింగ్‌ చైర్మన్‌ యెలికట్టె విజయ్‌ కుమార్‌ గౌడ్‌, వైస్‌ చైర్మన్‌ గడ్డమీది విజయ్‌ కుమార్‌ గౌడ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. కేవలం టెండర్లలో రిజర్వేషన్లు ఇస్తే గౌడ కులస్తులు బాగుపడరని, పక్క రాష్ట్రంలో మాదిరి కల్లుగీత సొసైటీలకు టెండర్లు మొదలుకొని రెంటల్‌ కూడా 50 శాతం సబ్సిడీ ఇస్తోందని, అలా రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇస్తే గౌడ కులస్తులను ఆదుకున్న వారవుతారని పేర్కొన్నారు. వైన్స్‌తో పాటు బార్లలో కూడా గౌడ కులస్తులకు 25 శాతం రిజర్వేషన్లు ప్రకటించాలని, ట్యాంక్‌బండ్‌పై సర్ధార్‌ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, జనగామ జిల్లాకు సర్వాయి పాపన్న జిల్లా పేరు పెట్టాలని, 50 ఏళ్లు దాటిన గీత కార్మికుడికి రూ.5 వేల పింఛన్‌ ఇవ్వాలని, చెట్టుపై నుంచి కిందపడ్డ కార్మికుడికి రూ.5 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో గౌడ ఐక్య సాధన సమితి అధ్యక్షులు అంబాల నారాయణ గౌడ్‌, వివిధ గౌడ, బీసీ సంఘాల నాయకులు దుర్గయ్య గౌడ్‌, వేములయ్య, సింగం నగేష్‌ గౌడ్‌, బత్తిని లతగౌడ్‌, గోద వెంకటేష్‌ గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలించిన హైడ్రా అధికారులు



ఎమ్మెల్యే కాలనీలో ప్రహరీ స్థలాన్ని పరిశీలిస్తున్న హైడ్రా అధికారులు

బంజారాహిల్స్‌: బంజారాహిల్స్‌ రోడ్డు నంబర్‌–12లోని శ్రీవెంకటేశ్వర కో–ఆపరేటివ్‌ హౌస్‌ బిల్డింగ్‌ సొసైటీ ఎమ్మెల్యే కాలనీలో ప్లాట్‌ నంబర్‌ 224/ఏ యజమాని రోడ్డును ఆక్రమించి ప్రహరీ నిర్మిస్తున్నాడని, దీని వల్ల రోడ్డు ఇరుకుగా మారి ట్రాఫిక్‌ సమస్యలు తలెత్తడమే కాకుండా సొసైటీ బైలాస్‌కు విరుద్ధంగా నిర్మాణాలు కొనసాతున్నాయని, చర్యలు తీసుకోవాల్సిందిగా సొసైటీ అధ్యక్షుడు టి.నారాయణరెడ్డి హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో హైడ్రా ఇన్‌స్పెక్టర్‌ నర్సింహారావుతో పాటు సంబంధిత అధికారులు గురువారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. సంబంధిత ప్లాట్‌ యజమానిని పిలిపించి పత్రాలు పరిశీలిస్తామని, అక్రమమైతే చర్యలు తీసుకుంటామని కాలనీవాసులకు హామీనిచ్చారు.

అన్నదానం



అమీర్‌పేట: వాసవి సేవాదళ్‌ క్లబ్‌ ఆధ్వర్యంలో గురువారం అమావాస్య అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. బల్కంపేట ఎల్లమ్మ దేవాలయం పాలక మండలి మాజీ సభ్యులు, వాసవి క్లబ్‌ అమీర్‌పేట వ్యవస్థాపకులు సింగారపు శ్రీనివాస్‌ గుప్త ముఖ్య అతిథిగా హాజరై అన్నదానం చేశారు. కార్యక్రమంలో వాసవి క్లబ్‌ ఇంటర్నేషనల్‌ ఉపాధ్యక్షులు ఆర్‌.శ్రీనివాసులు పాల్గొన్నారు.

రేషన్‌కార్డుల దరఖాస్తుల పరిశీలన వేగవంతం

బౌద్ధనగర్‌: సీతాఫల్‌మండి, బౌద్ధనగర్‌ డివిజన్లలో రేషన్‌ కార్డుల దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ వేగవంతం చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్‌ ఉత్తేజ్‌ తెలిపారు. సర్కిల్‌ 9 అధికారి చాముండేశ్వరి ఆదేశాలతో ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది దరఖాస్తులను పరిశీలిస్తున్నారు.

